


పియుసి విద్యార్థులకు గ్రాఫిక్ డిజైనింగ్ వర్క్‌షాపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

టెక్‌జైట్-25 క్వాంటమ్ టెక్నాలజీస్ 2.0 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రాఫిక్ డిజైనింగ్ వర్క్‌షాపు ఘన విజయం సాధించింది. గురువారం ఎస్ఎసి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యంగా పియుసి విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరుకావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వర్క్‌షాపునకు ప్రముఖ గ్రాఫిక్ డిజైనర్ కెవి.ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై గ్రాఫిక్ డిజైనింగ్ రంగానికి సంబంధించిన అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజైన్ అనేది ఒక బ్రాండ్‌కు మౌన రాయబారి అనే భావనతో ఆయన చేసిన ప్రసంగం విద్యార్థులను ఎంతో ప్రేరేపించింది. వర్క్‌షాపులో భాగంగా గ్రాఫిక్ డిజైన్ గురించి, దాని మౌలిక సూత్రాలు, గ్రాఫిక్ డిజైన్ ఉపయోగించే రంగాలు, వివిధ డిజైనింగ్ టూల్స్, కాన్సెప్ట్, స్ట్రాటజీ వంటి అంశాలను సులభమైన ఉదాహరణలతో వివరించారు.



పేదల పొట్టకొట్టి.. బీడుగా భూములు..!

- నిరుపయోగంగా వట్లూరు భూములు
- పరిశ్రమా లేదు.. సాగుకు దూరంగా 350 ఎకరాలు
- రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా గెంటివేత
- గత జనవరి16న జరిగిన డిఆర్‌సి సమావేశంలో చర్చ
- ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడితే ఒట్టు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పరిశ్రమ కడతానన్నారు. వందల మందికి ఉపాధి దొరుకుతుందని నమ్మబలికారు. రైతులకు పరిహారం ఇస్తామని నమ్మించి పంటపొలాలు లాక్కున్నారు. తొమ్మిదేళ్లు గడిచినా పరిశ్రమ లేదు. రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా వందల ఎకరాల వట్లూరు పెద్ద చెరువు భూములను బీడుగా పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేస్తామంటూ పెద్దఎత్తున హడావుడి చేసింది. భూముల కోసం అన్వేషించి 2016లో పెదపాడు మండలం వట్లూరులోని భూములను ఎంపిక చేశారు. దశాబ్దాల తరబడి రైతుల సాగులో ఉన్న 350 ఎకరాలను రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా తీసుకుంది. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. ఆ భూములు వట్లూరులోని పెదచెరువు భూములుగా రికార్డుల్లో ఉండటంతో రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో రైతులు తమ పోరాటం సాగించడంతో ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇచ్చేలా నిర్ణయించారు. అప్పటి ఉండి ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు కుటుంబంలోని వారికి పరిశ్రమ ఏర్పాటుకు ఆ భూములను కట్టబెట్టారు. సిఎంగా ఉన్న చంద్రబాబు శంకుస్థాపన సైతం చేశారు. అయితే టిడిపి హయాంలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చినా పరిశ్రమ ఏర్పాటు గురించిగాని, రైతులకు పరిహారం విషయంగాని పట్టించుకోలేదు. ఆ భూములపైనే ఆధారపడి బతికిన రైతులంతా రోడ్డునపడ్డారు. తొమ్మిదేళ్లుగా రైతులకు చిల్లిగవ్వ పరిహారం కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతులు కోర్టును ఆశ్రయించారు. రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఎకరాకు 50 బస్తాల ధాన్యం పండే 350 ఎకరాల భూములు తొమ్మిదేళ్లుగా బీడుగా మారిపోయాయి. తమ భూములు తమకు ఇవ్వాలని, లేదా పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు సైతం బీడుగా ఉన్న వట్లూరు భూముల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

డిఆర్‌సిలో చర్చ.. అయినా అడుగు ముందుకు పడితే ఒట్టు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2025 జనవరి 16 తేదీన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన డిఆర్‌సి సమావేశం జరిగింది. వట్లూరులో బీడుగా ఉన్న భూముల అంశాన్ని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ లేవనెత్తారు. ఆ భూముల వ్యవహారం కోర్టులో ఉందని, ఎపిఐసిసికి ప్రభుత్వం కేటాయించిందని అధికారులు సమాధానం ఇచ్చారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ జోక్యం చేసుకుని రైతులకు పరిహారం ఇవ్వలేదని, కోర్టు కేసులు పరిష్కరించి రైతులకు పరిహారం ఇచ్చి అక్కడ ఏదైనా పనులు మొదలు పెడితే బాగుంటుందని తెలిపారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. దాదాపు ఏడాది గడిచిపోయింది. ఇప్పటి వరకూ వట్లూరు భూములపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. మాది మంచి ప్రభుత్వం అంటూ చెప్పడం తప్ప.. ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా వట్లూరు భూసమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాల్సి ఉంది. రైతులకు తిరిగి భూములిచ్చేస్తే సాగులోకి వచ్చి, వేల బస్తాల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అలాకాకుండా బీడుగా పెట్టడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

4న విశాఖలో సిఐటియు బహిరంగ సభ

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

సిఐటియు 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా జనవరి నాల్గో తేదీన విశాఖలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకోసారి జరిగే సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖ నగరంలో తొలిసారిగా జరగనుందన్నారు. బహిరంగ సభలో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, అఖిల భారత నాయకులు ఎఎం.గఫూర్, యలమరం కరీం, జి.సాయిబాబు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల నాయకులు దేశం నలుమూలల నుండి ఈ మహాసభల్లో పాల్గొంటారన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ మహాసభలో చర్చించి పలు తీర్మానాలను ఆమోదిస్తారని తెలిపారు. అనేక పోరాటాలతో కార్మికవర్గం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నవంబర్ 21వ తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు సమరశీల పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను బేషరతుగా రద్దు చేసే వరకు సిఐటియు కార్మికవర్గం తరపున పోరాటాలు నిర్వహిస్తుందని, తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, రాష్ట్రంలో 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మాజీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసింహారావు, నాయకులు సిహెచ్.సుందరయ్య, జె.గోపీ, పంపన రవికుమార్, కుమార్, షమీమా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలపై దాడి దారుణం

తగిన చర్యలు తీసుకుని పంటకు నష్ట పరిహారం చెల్లించాలి

ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి

ప్రజాశక్తి - ఏలూరు

బుట్టాయగూడెం మండలంలోని ఇనుమూరు గ్రామంలో మొక్కజొన్న పంటను సాగు చేసుకుంటున్న గిరిజన మహిళలపై పోలీసుల దాడి, మొక్కజొన్న పంటను ధ్వంసం చేయడం దారుణమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇనుమూరు గ్రామంలో 57 కుటుంబాలవారు (ఎస్‌టి) ఉన్నారని, వీరి జీవనాధారం వ్యవసాయమని తెలిపారు.

వారి పూర్వీకులు, వారు సదరు భూములను ఎసైన్‌మెంట్ చేయాలని పలుమార్లు దరఖాస్తు పెట్టుకున్నారని పేర్కొన్నారు. పోలీసులు, రెవెన్యూ మండల అధికారులు గిరిజనేతర భూ స్వాములకు అండగా ఉండి మొక్కజొన్న పంటను ధ్వంసం చేయించడమే కాకుండా గిరిజన మహిళలపై మగ పోలీసులు దారుణంగా దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, ఈ చర్యకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని, పంటకు నష్టపరిహారం ఇవ్వాలని, తక్షణం భూసమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

గిరిజనులపై దాడులు, నిర్బంధం ఆపాలి

భూసమస్యలు పరిష్కరించాలి

వామపక్షాల డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామంలో గిరిజనులపై దాడులు చేయడం, తప్పుడు కేసులు బనాయించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. గిరిజనులపై దాడులు, నిర్బంధాన్ని వెంటనే ఆపాలని, భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు యు.వెంకటేశ్వరరావు (యువి), ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు సావనంపూడి నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సాలి రాజశేఖర్ తదితర వామపక్ష నేతలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూసమస్యల పట్ల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని, భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని వారు విమర్శించారు. ఏజెన్సీ భూసమస్యల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని జిఒ నెం.1049/28-7-2007 ఉందని, ఈ జిఒకు విరుద్ధంగా పోలీసులు ఏజెన్సీ భూ సమస్యల్లో జోక్యం చేసుకుని గిరిజనులు, పేదలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని తెలిపారు. గిరిజనులు వేసుకున్న పంటలను ట్రాక్టర్లతో దున్నేసి, ధ్వంసం చేస్తుంటే తగదని గిరిజనులు అడిగితే వారిపై దాడి చేసి, కొట్టి గాయపరిచారని, గిరిజన మహిళలపై సైతం మగ పోలీసులే దాడి చేసి కొట్టారని ఆరోపించారు. ఈ దాడుల్లో చంద్రశేఖర్ అనే గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడని, మహిళలతోసహా మరికొందరు గిరిజనులకు గాయాలయ్యాయని పేర్కొన్నారు. అయితే వాస్తవాలకు భిన్నంగా గిరిజనులే నేరస్తులు అన్నట్లు, గిరిజనులు అరాచక చర్యలకు పాల్పడినట్లుగా పోలీస్, రెవెన్యూ అధికారులు చిత్రీకరిస్తూ తప్పుడు కేసులు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ప్రజలు, నాయకులపై తప్పుడు కేసులతోపాటు పీడీ యాక్ట్ సైతం బనాయించి అణిచివేయాలని చూస్తున్నారని, ఇది అప్రజాస్వామికమని తెలిపారు. తక్షణం గిరిజనులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని, చట్టాలకు లోబడి గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.

కళ్ల సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ కంటి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రవికిరణ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మానవ శరీరంలో కళ్లు అత్యంత సున్నితమైన అవయవాలని, వాటి సంరక్షణలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కంటి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రవికిరణ్ సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. కనుచూపు తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చిన్నపిల్లల్లో అధికంగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్స్ చూడటం వల్ల కంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పిల్లలు, యువత రోజూ కొంత సమయం కళ్లకు విశ్రాంతి ఇవ్వడం, సహజ కాంతిలో పుస్తకాలు చదవడం వంటి అలవాట్లు పాటించాలని సూచించారు.

ప్రశ్న: కంటి వైద్య రంగంలోకి రావడానికి మిమ్మల్ని ప్రేరేపించిన ముఖ్యమైన అంశం ఏమిటి?

వైద్యులు: ఎంబిబిఎస్ తర్వాత చాలామంది రేడియాలజీ లేదా జనరల్ మెడిసిన్‌ను ఎంచుకుంటారు. అయితే కంటిచూపు సమస్య అనేది భారతదేశంలోనే ఎక్కువగా ఉంది. ఎంబిబిఎస్ చదువుతున్న రోజుల్లోనే కొంచెం టెక్నాలజీపరంగా ఆకర్షితుడిన య్యాను. అదేవిధంగా చిన్నప్పుడు పెద్ద ఆపరేషన్లు అంటే రక్తం అవి చూసి భయమేసేది. అందులోనూ టెక్నాలజీ పరంగా పేషెంట్ నొప్పి రాకుండా చేయవచ్చని ఈ రంగానికి వచ్చాను.

ప్రశ్న: సాధారణంగా ప్రజల్లో కనిపించే కంటి సమస్యలు ఏమిటీ?

వైద్యులు: జనరల్ ఓపిలో చూసినప్పుడు ఎక్కువగా శుక్లాల సమస్య ఉంటుంది. అదేవిధంగా చిన్న పిల్లల్లో ఎలర్జీ కంజెక్టు వైటీస్ అని కళ్లు నలుపుతూ ఉంటారు. ఈ సమస్య ఎక్కువగా చూస్తుంటాం.

ప్రశ్న: కంటి చూపు తగ్గడానికి ప్రధాన కారణాలు?

వైద్యులు: కంటి వక్రీభవన లోపం కారణంగా ప్రధానంగా కంటిచూపు తగ్గుతుంది. దీనివల్ల 50 నుంచి 60 శాతం చిన్న పిల్లల్లో కంటి చూపు తగ్గుతుంది. దాని తర్వాత ప్రధాన కారణం శుక్లాలు.

ప్రశ్న: కంటి ఆపరేషన్లు చేయించుకుంటే కళ్లకు సురక్షితమేనా, భవిష్యత్తులో ఏమైనా సమస్యలు వస్తాయా?



వైద్యులు: కంటి ఆపరేషన్లు చేయించుకుంటే చిన్న సమస్య ఉంటుంది. అయితే శుక్లాలు ఆపరేషన్ మాత్రం చాలా సురక్షితమైనది. వెయ్యి మందిలో ఒకరిద్దరు మాత్రమే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడతారు.

ప్రశ్న: మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ స్క్రీన్లు చూడటం వల్ల వచ్చే సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

వైద్యులు: కోవిడ్ తర్వాత కాలంలో ఈ డిజిటల్ స్క్రీన్ చూడడం పిల్లల్లో ఎక్కువ పెరిగింది. దీనివల్ల పిల్లల్లో మయోపియా ఎక్కువగా వస్తుంది. అంటే దగ్గర చూపునకు అలవాటు పడటంతో దూరం చూపు కొంచెం తగ్గుతుంది. దీనినే మయోపియా అంటారు. దీన్ని నివారించడానికి పిల్లల్లో డిజిటల్ స్క్రీన్ చూసే సమయాన్ని తగ్గించాలి. అయితే టీచర్లు ఆన్‌లైన్ క్లాసులు, ఏదైనా నేర్చుకోవడానికి కూడా కాలేజీల వారు అవే డిజిటల్ క్లాసులు సూచిస్తున్నారు. కాబట్టి అవి తగ్గించలేం. అయితే టీవీలోగాని, ల్యాప్‌టాప్ వంటి పెద్ద స్క్రీన్‌లో చూడటం వల్ల కొంత ఉపయోగమే. పిల్లలను సూర్యరశ్మిలో కనీసం గంటసేపైనా ఆడుకోని వ్వాలి. కంటికి 'ఎ' విటమిన్ మంచిది కాబట్టి పిల్లలకు 'ఎ' విటమిన్ ఇచ్చే ఆకుకూరలు, పండ్లు వంటివి ఎక్కువగా పెట్టాలి.

ప్రశ్న: లేజర్ సర్జరీ అంటే ఏమిటి? ఆ సర్జరీ అందరికీ అవసరమా?

వైద్యులు: లేజర్ సర్జరీ అంటే కళ్లద్దాలు లేకుండా చేసే శస్త్ర చికిత్స. ఇది అందరికీ అవసరం లేదు. ఎక్కువ పవర్ ఉన్నవాళ్లకి దీని అవసరం ఉంటుంది. అయితే లేజర్ చికిత్స చాలా సురక్షితమైనది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్ రావడం చాలా తక్కువ.

ప్రశ్న: చిన్నపిల్లల్లో అధికంగా కనిపించే కంటి సమస్యలు ఏమిటి?

వైద్యులు: చిన్నపిల్లల్లో అధికంగా కన్పించేది ఎలర్జీ కంజక్టివైటీస్. పిల్లలు బయట తిరుగుతూ ఆడుకుంటూ ఉంటారు. ఆ సమయంలో వాళ్ల కళ్లలో దుమ్ము, చెట్ల తాలూకా పిప్పడి పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వాటి వల్ల ఎలర్జీ వచ్చే అవకాశం ఉంది. దానివల్ల కన్ను ఎక్కువగా నలుపుతూ ఉంటారు అలా నడపడం వల్ల నల్ల గుడ్డును బలహీనపడి కంటి చూపు తగ్గుతుంది.

ప్రశ్న: చిన్న పిల్లలు మొబైల్, టీవీలు చూడటం వల్ల వచ్చే కంటి సమస్యలు ఏమిటి?

వైద్యులు: చిన్న పిల్లలు ఎక్కువగా మొబైల్ చూడటం వల్ల ప్రధానంగా వచ్చేది మయోపియా. అదేపనిగా డిజిటల్ స్క్రీన్ చూడటం వల్ల కనురెప్ప మూసి, తెరిచేది తగ్గిపోతుంది. దానివల్ల రెప్ప వేయడం తగ్గిపోతుంది. దాని నుంచి కన్ను పొడబారిపోవడం, బ్లూ లైట్ కంటి మీద పడటం వల్ల కంటినరం దెబ్బతిని కంటి చూపు తగ్గుతుంది.

ప్రశ్న : వృద్ధాప్యంలో సాధారణంగా ఎదురయ్యే కంటి సమస్యలు?

వైద్యులు: వృద్ధాప్యంలో ప్రధానంగా చెప్పుకునే సమస్య కంటి శుక్లాలు. 50 నుంచి 60 సంవత్సరాలు దాటగానే అందరిలోనూ శుక్లాల ఛాయ మొదలవుతుంది. వారి వ్యక్తిగత అలవాట్లు, సూర్యరశ్మి తగలకపోవడం వల్ల శుక్లాల సమస్య ఎక్కువగా పెరుగుతుంది. లేదా నిదానంగానైనా పెరుగుతుంది. మరొకటి కంటి రెటీనాకు సంబంధించిన సమస్య. అందులో వయస్సుతోపాటు పసుపు రంగు పదార్థం వంటిది రెటీనా వద్ద పెరుగుతూ ఉంటుంది. అది పెరిగే క్రమంలో రక్తనాళాలు బలహీనపడి రక్తం కారడం వంటివి జరిగి చూపు తగ్గిపోయే సమస్య ఉంటుంది. అదేవిధంగా నీటి కాసులు, గ్లోకోమా వంటివి కూడా వచ్చే అవకాశం ఉంది.

భీమవరం డిఎస్‌పిగా రఘువీర్ విష్ణు

జయసూర్యపై బదిలీ వేటు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం డిఎస్‌పి ఆర్.జయసూర్యపై బదిలీ వేటు పడింది. మంగళగిరిలోని హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని జయసూర్యను ఆదేశిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో విఆర్‌లో ఉన్న రఘువీర్ విష్ణును నూతన డిఎస్‌పిగా నియమించింది. పేకాట్ క్లబ్‌లకు అనుమతి, సెటిల్‌మెంట్ వ్యవహారాలపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కన్నెర్ర చేసి డిఎస్‌పిపై విచారణకు ఆదేశించిన సుమారు రెండు నెలల తర్వాత జయసూర్యపై బదిలీ వేటుపడింది.



రఘువీర్ విష్ణు



ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న మంత్రి రామానాయుడు

నెంబర్ ప్లేట్లు లేకుంటే వాహనాలు సీజ్

హెల్మెట్ ధారణ తప్పనిసరి

రహదారి భద్రతపై స్పెషల్ డ్రైవ్‌లో ఎఎస్‌పి సుస్మిత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జంగారెడ్డిగూడెం ఎఎస్‌పి ఎఎస్‌పి సుస్మిత చెప్పారు. పట్టణంలో రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఎఎస్‌పి సుస్మిత ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమంతో పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై కఠిన చర్యలు తీసుకున్నారు. జరిమానాలు విధించడమే కాకుండా వాహనదారులతో



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్‌పి సుస్మిత

అక్కడికక్కడే హెల్మెట్లు కొనుగోలు చేయించి ధరింపజేయడంతో పాటు, నెంబర్ ప్లేట్లు అమర్చుకునేలా చర్యలు చేపట్టారు. ఇకపై నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని ఎఎస్‌పి గారు హెచ్చరించారు. ఆమె స్వయంగా వాహన తనిఖీలు చేపట్టి హెల్మెట్ లేని వారికి, సరైన పత్రాలు లేని వారికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో యువతే ఎక్కువగా ఉన్నారని, అతివేగం, నిర్లక్ష్యం, థ్రిల్ కోసం వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రమాద సమయంలో తలకు తగిలే చిన్న దెబ్బ కూడా ప్రాణాంతకం కావొచ్చని, హెల్మెట్ ధరించడం ద్వారా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు లేకుండా ప్రయాణించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సిఐ ఎంవి.సుభాష్, ఎస్ఐ వీరప్రసాద్, ట్రాఫిక్ పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు రైతుగా మారారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ, శాఖాపరమైన పనులు, పార్టీ బాధ్యతలతో బిజీగా ఉండే మంత్రి తీరిక లభించినప్పుడల్లా తనకు అత్యంత ఇష్టమైన వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్న సంగతి తెలిసిదే. క్రిస్మస్ సందర్భంగా కొంత తీరిక లభించడంతో తన స్వగ్రామం ఆగర్తిపాలెంలోని పొలానికి వెళ్లారు. ట్రాక్టర్‌తో దుక్కు దున్ని, గట్టు లంకలు వేస్తూ స్వయంగా వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ అయినా, మంత్రి అయినా కనీసం సీజన్‌లో ఒక గంటో, ఒక పూటో వ్యవసాయ పనులు చేస్తే రైతు కష్టం, వ్యవసాయం విలువ స్పష్టంగా తెలుస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.



గట్టు లంకలు వేస్తున్న మంత్రి

నాలుగో రోజుకు ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా నాలుగో రోజు 2, 4, 8, 9 యూనిట్లు తమ తమ దత్తత గ్రామాల్లో పలు సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాయి. గురువారం ఉదయం ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో సుంకొల్లులోని రోడ్డు పక్క ప్రాంతాల్లో మెగా క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. పరిపాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు చేతులమీదుగా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటించే కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భోజనానంతరం ఇంటింటికి వెళ్లి ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో గొడుగువారిగూడెంలోని ఎంపిపి పాఠశాల ఆవరణలో పరిపాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు చేతుల మీదుగా మొక్కలను నాటించే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి, తరగతి గదులు, మైదానాన్ని శుభ్రం చేశారు. గోడలపై ఉన్న పాత సున్నాన్ని తొలగించి కొత్తగా రంగులు వేసి పాఠశాలకు ఆకర్షణీయమైన రూపు తీసుకొచ్చారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-8 ఆధ్వర్యంలో యానాది కాలనీలో యాంటీ-డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో యనమదల గ్రామంలో ప్లాస్టిక్ వ్యతిరేక అవగాహనా ర్యాలీ నిర్వహించారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ మనోజ్

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ముదినేపల్లి వీర్రాజు కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతూ గురువారం ఉదయం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబులు వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్‌కు విషయం తెలిపారు. డాక్టర్ మనోజ్ ఫోన్ పే ద్వారా రూ.ఐదు వేలు వెంటనే దహన సంస్కారాల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంటా రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యరాజ్ పుట్టినరోజు వేడుక

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రముఖ జీవన సౌందర్యానికి సమానమైనది మరొకటి లేదని మహాకవి శ్రీశ్రీ చెప్పిన మాటలను ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని ఎన్‌టిఆర్‌వి అధినేత సింగంశెట్టి సత్యరాజ్ అన్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పని చేస్తున్న 120 మంది పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందించారు. వైసిపి నాయకుడు బత్తిన చిన్న చేతులమీదుగా పురుషులకు, మహిళలకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా బత్తిన చిన్న మాట్లాడుతూ కార్మికులను గుర్తించి గౌరవించడం అభినందనీయమన్నారు. అనంతరం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న 80 మంది ఇన్‌పేషెంట్లకు పండ్లు, రస్కులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

బడేటి చంటిని కలిసిన సర్పంచి విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ముదినేపల్లి



బడేటి చంటితో విశ్వేశ్వరరావు

టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని టిడిపి ముదినేపల్లి మండల సీనియర్ నేత, శ్రీహరిపురం గ్రామ సర్పంచి వరసాల విశ్వేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరులోని టిడిపి కార్యాలయంలో బడేటి చంటిని కలిసిన విశ్వేశ్వరరావు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు పార్లమెంటరీ కమిటీ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీలో ఏలూరు శాసనసభ నియోజకవర్గం నుంచి నియమితులైన ఏడుగురు సభ్యులకు పవర్‌పేట ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య(చంటి) నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, టిడిపి నాయకులు పలువురు శాలువాలు కప్పి బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా కో-ఆర్డినేటర్ చల్లా ప్రసాద్ (కంప్యూటర్ ప్రసాద్), ఉపాధ్యక్షులు గూడవల్లి వాసు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి ఉప్పాల జగదీష్‌బాబు, అధికార ప్రతినిధి పూజారి నిరంజన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జంపా సూర్యనారాయణ, షేక్ అహ్మద్ కాజా, కార్యదర్శి చింతలి జ్యోతిని సన్మానించారు. పార్టీని మరింత బలోపేతం చేయడంలో సమిష్టిగా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతిరావు, అమరావతి అశోక్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చింతలపూడి

ఎస్‌సి, ఎస్‌టి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అభివృద్ధి చెందాలని ఐపిఎస్ సీనియర్ అధికారి పివి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆయన స్వగృహం వద్ద ఎస్‌సి, ఎస్‌టి వర్కింగ్ జర్నలిస్ట్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ నూతన డైరీను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి యువతకు ఉద్యోగావకాశాలు ఇవ్వాలన్నారు. పోర్ట్ ఎస్టేట్‌గా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి జర్నలిస్టులు ప్రజల్లో ప్రత్యేక దళిత పంచాయతీల గురించి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రెసిడెంట్ రాజా, రవి, కృపావరం, పవన్, రజని, కాంతారావు పాల్గొన్నారు.

సిపిఐ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సిపిఐ శత వార్షికోత్సవంలో భాగంగా ఏలూరు నగరంలో వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీ, సిపిఐ నాయకులు వీరమాచినేని విమలాదేవి, కమ్యూనిస్టు నాయకులు నర్రా ఆంజనేయులు స్మారక స్థూపాల వద్ద శత వార్షికోత్సవ కార్యక్రమం కొత్తపేట సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిపిఐ పతాకాన్ని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆవిష్కరించారు. విమలాదేవి స్థూపానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. నర్రా ఆంజనేయులు స్మారక స్థూపానికి సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ పూలమాలవేసి నివాళులర్పించారు. సభకు సిపిఐ కొత్తపేట నాయకులు చింతల సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పుప్పాల కన్నబాబు, కొత్తల రాము, గేదెల నాగేశ్వరరావు, రెడ్డి నాగేశ్వరరావు, కనకం జగన్, యర్రా వెంకటేశ్వర్లు, పోలా వెంకటభాస్కరరావు, సాయన బాలు, బేత శంకర్, సిపిఎం నాయకులు బొత్స సింహాచలం, బి.శేఖర్, పాల జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు



క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది, స్థానికులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను - రాజమండ్రి జాతీయ రహదారిపై పొలసానిపల్లి ఫ్లై ఓవర్ వద్ద గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు తీవ్ర గాయాలపాలైంది. ద్వారకాతిరుమలకు చెందిన ఉప్పల విజయలక్ష్మి ఏలూరు నుంచి ద్వారకాతిరుమల వెళ్లేందుకు ప్రయివేట్ వాహనంపై పొలసానిపల్లి ఫ్లైఓవర్ వద్దకు వచ్చారు. అక్కడ నుంచి ద్వారకాతిరుమల వెళ్లే బస్సు కోసం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి తీవ్ర గాయాలపాలైంది. అదే సమయంలో అటుగా వచ్చిన పొలసానిపల్లి సర్పంచి దంపతులు రహీమా బేగం హసేన్, హసేన వృద్ధురాలిని డివైడర్‌పై చేర్చేందుకు సహకరించారు. తీవ్రంగా గాయపడిన విజయలక్ష్మి తన వివరాలను తెలిపే పరిస్థితిలో లేదు. దీనిని గమనించిన సర్పంచి దంపతులు ఆమె బ్యాగ్‌ను పరిశీలించారు. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వివరాలను తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ క్రమంలో వారు 108 సర్వీసుకు సమాచారం అందించారు. తక్షణం అక్కడికి చేరుకున్న 108 వాహనం పైలట్ సుబ్బారావు, ఎక్విప్‌మెంట్ ప్రదీప్ తగు రీతిలో బాధితురాలికి వైద్య సహాయం అందించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స తర్వాత, కాలు విరిగిన నేపథ్యంలో ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. గాయపడిన విజయలక్ష్మి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలోనే కాకుండా, చికిత్స కోసం వైద్యశాలకు తరలించేందుకు సహకరించిన సర్పంచి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్రాంతికి సిద్ధమవుతున్న పందెం కోళ్లు

విరివిగా కోళ్ల పెంపకం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంక్రాంతిని పురస్కరించుకుని పండుగ మూడు రోజులు పందేలు జోరుగా నిర్వహించేందుకు మండలంలోని పందేల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అడపాదడపా ముసుగు కోడి పందేలు మొదలయ్యాయి. ముదినేపల్లి మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బరిలో దింపేందుకు కోడి పుంజులను భారీగా పెంచుతున్నారు. కోడి పందేల రాయుళ్లు నాలుగు నెలలుగా పుంజులను పెంచే పనిలో నిమగ్నమయ్యారు. కూటమి ప్రభుత్వం సంక్రాంతి సంబరాలకు అనుమతి ఇస్తుండటం, సంబరాల పేరుతో విచ్చలవిడిగా కోడి పందేలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.



కోడిపుంజులు

పోలీసుల భయం లేకుండా సంక్రాంతి సంబరాల్లో పందేలు వేసే అవకాశం ఉండటంతో గ్రామగ్రామాన పందెం పుంజులను భారీగా పెంచుతున్నారు.



షెడ్లలో పెంచుతున్న కోడిపుంజులు

ఇప్పటికే పలు గ్రామాల్లో కోడిపందేల బరులు సిద్ధం చేసే పనుల్లో పందెంరాయుళ్లు నిమగ్నమయ్యారు. మండలంలో గురజ, పెదపాలపర్రు, పెయ్యేరులోని వైఎస్ఆర్ కాలనీ, వాడవల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసి కోడి పుంజులను పెంచుతున్నారు. ఒక్కో వ్యక్తి 20 నుంచి 50 పుంజులను ప్రత్యేక షెడ్డుల్లో ఉంచి పర్యవేక్షిస్తున్నాడు. ఇలా మండలంలో సుమారు 300 పుంజులు తయారవుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో పుంజు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కోడిపుంజుల అమ్మకాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పుంజు సామర్థ్యాన్ని బట్టి రూ.ఐదు వేల నుంచి రూ.25 వేలకు పైగా ధర పలుకుతోంది. కోడిపందేలు, జూదం సాగనివ్వబోమని ఓ వైపు పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ పందేల పండుగ నిర్వహించేందుకు పందెంరాయుళ్లు ఇప్పటికే సమాయాత్తమవుతున్నారు.

పదేళ్లనుంచి పందెం కోళ్ల పెంపకం

అరుగుల మహేష్, ముదినేపల్లి



గత పదేళ్ల నుంచి పందెం కోళ్ల పెంపకం చేస్తున్నా. నాలుగు నెలలు క్రితం మొవ్వ ఫణింద్రతో కలిసి మూడు ప్రాంతాల్లో కోళ్ల పెంపకం చేస్తున్నాం. కాకి, డేగ, నెమలి, తేతువా, పింగళి వివిధ రకాల పందెం పుంజులను కొనుగోలు చేసి రెండున్నర, మూడున్నర కేజీల బరువు ఉండేలా పుంజులను సిద్ధం చేస్తాం. పుంజు సామర్థ్యాన్ని బట్టి రూ.15 వేల నుంచి రూ.25 వేలుకు పైగా ధర పలుకుతోంది. ఫామ్ దగ్గరే విక్రయిస్తాం.


సత్యనారాయణకు అవార్డు

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ వినియోగదారుల దినోత్సవం-2025 పురస్కరించుకుని గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కొవ్వలి వినియోగదారుల సేవా మండలిని ఉత్తమ అసోసియేషన్‌గా గుర్తించినట్లు న్యాయవాది ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ అసోసియేషన్ కన్వీనర్ కట్టా సత్యనారాయణ తెలిపారు. జిల్లా పరిధిలో వినియోగదారుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ఉత్తమ అసోసియేషన్‌గా నిలిచిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ్, జిల్లా సివిల్ సప్లై అధికారి విలియమ్స్ ఆదేశాల మేరకు గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ సివిల్ సప్లయిస్ శాఖకు సిఫార్స్ చేయగా ఎస్.ఢిల్లీరావు (వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎపి స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్), ఆర్.గోవిందరావు (డైరెక్టర్ ఆఫ్ సివిల్ సప్లయిస్, ఎక్స్ ఆఫీసు డిప్యూటీ సెక్రటరీ టు గవర్నమెంట్, సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్) డాక్టర్ జి.లక్ష్మీషా (కలెక్టర్ డిస్టిక్ మెజిస్ట్రేట్, ఎన్‌టిఆర్ జిల్లా) వారి చేతుల మీదుగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోవడమైనదని కట్టా సత్యనారాయణ తెలిపారు.

టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధిగా దాలయ్య

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



దాలయ్యను అభినందిస్తున్న ప్రముఖులు

టిడిపి రాజమండ్రి పార్లమెంట్ అధికార ప్రతినిధిగా ద్వారక తిరుమల మాజీ ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు యేపూరి దాలయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా దాలయ్యను ఆయన స్వగృహం వద్ద రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండలాధ్యక్షుడు లంకా సత్యనారాయణ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు, తెలుగు యువత గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షులు పాతూరి సహృదయ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు ఘంట శ్రీనివాసరావు, తెలుగు రైతు మండలాధ్యక్షులు పాకలపాటి మాణిక్యాలరావు, పార్టీ మండల నాయకులు నాదెళ్ల వేణు, నాదెళ్ల వెంకటేశ్వరరావు, ఆచంట సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి పాకలపాటిమధు, ఐటిడిపి మండలాధ్యక్షులు ఏపూరి కిషోర్, బయవరపు శివ, విజయ్, పాకలపాటి భద్రరావు, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు

వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



నూజివీడులో...


నూజివీడు పట్టణంలోని బేతేలు, ఆర్‌ఆర్.పేట, సమతా నగర్ పలు పార్థనా మందిరాల్లో, కృష్ణవిలాస్ మండపంలో క్రైస్తవ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరై యాత్రికులకు, ఫాదర్లకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి కొలుసు పార్థసారథి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రికి చర్చి ఫాదర్లు, సిస్టర్లు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించిందన్నారు. జెరూసలేము యాత్రకు, విదేశీ విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించిందని, క్రిస్టియన్ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అవసరమైన సహాయ సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కూటమి నాయకులు, చర్చి ఫాదర్లు, సిస్టర్లు, చర్చి, పెద్దలు, సిహెచ్.దుర్గాప్రసాద్, రఘు, ఆది, వాసు, చందు, ఇళయరాజా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : క్రిస్మస్ సందర్భంగా నగరపాలకసంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాల ప్రాంగణంలో ఉన్న చర్చికి వెళ్లారు. మోస్ట్ రెవరెండ్ ఫాదర్ బిషప్ పొలిమేర జయరావుకు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువా కప్పి సన్మానించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ముదినేపల్లి : మండల వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. ముదినేపల్లి ఎల్ ఇఎఫ్ చర్చి పాస్టర్ రాజు మాట్లాడారు. మండలవ్యాప్తంగా గురువారం క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్చిలను వివిధ రకాల విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. పలు గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచే విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా మరికొన్ని గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవ కుటుంబాలు భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. మండలంలోని కొరగుంటపాలెం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎస్ఐ వీరభద్రరావు పాల్గొని కేక్ కట్ చేశారు. మండలంలోని ప్రధానమైన చర్చిలన్నీ క్రిస్మస్ వెలుగులు సంతరించుకున్నాయి. క్రిస్మస్ వెలుగుల్లో పండుగను క్రైస్తవ కుటుంబాలన్నీ భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా కొన్ని చర్చిల ముందు ఏసుక్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని చాటేవిధంగా పశువుల పాక, సాంబ్రాణి, గొల్లలు, జ్ఞానులు కృత్రిమ బొమ్మలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు భారీ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పెంతికోస్తు, సిఎస్ఐ, సిబిసిఎన్ సి, ఆర్‌సిఎం, ఫెలోషిప్, క్రీస్తు సంఘం, పెనుయేలు ప్రార్థన మందిరం, బాలమ్మ, రక్షణ సైన్యం తదితర క్రీస్తు ప్రార్థన ఆలయాల్లో చిన్నారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాస్టర్లు యేసుక్రీస్తు జన్మదిన విశిష్టతను క్రైస్తవ సోదరులకు వివరించారు. ఈ వేడుకల్లో సంఘ సభ్యులు, సంఘస్తులు, విశ్వాసులు, యువత, సండే స్కూల్ పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో చర్చిలన్నీ కిటకిటలాడాయి.

అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో..

ముదినేపల్లి అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



జంగారెడ్డిగూడెంలో..

అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడ నుండి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేయడం కోసం 40 మంది యువకులు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో వివిధ పార్టీల నాయకులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, టిడిపి మండలాధ్యక్షులు చల్లగుల శోభనాద్రి చౌదరి,



ఏలూరులో....

చాపరాల దుర్గాప్రసాద్, తహశీల్దార్ లతీఫ్ పాషా, ఎస్ఐ వీరభద్రరావు, కొడాలి వినోద్, కోడూరు శేషుబాబు తదితర నాయకులను అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ శాలువా కప్పి, మిఠాయి తినిపించి, పూల బొకెలతో, సన్మానించి



చింతలపూడిలో...

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు డాక్టర్ సేవా నాగ జగన్ బాబూరావు, మేడపాటి తంబి, లేళ్ల ప్రసాద్, గద్దె రాజు, పుట్టి నరసింహారావు, సోమల వెంకటేశ్వరరావు, కొరగంటి రాంపండు, కొప్పుల నాగరాజు, గండేపూడి మహేంద్ర, పలుకుర్తి పండు, సోమల చింటూ, పులి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో...

ముసునూరు : క్రిస్మస్ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని 16 గ్రామాల్లో ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


సింగం శెట్టి సత్యరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు

చింతలపూడి : దళిత వాడలు పంచాయతీలుగా ఏర్పడినప్పుడే బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని ఐపిఎస్ సీనియర్ అధికారి పి.వి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని బోయ గూడెం, సుప్రీంపేట గ్రామాల్లో పలు చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన తల్లి సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడ ప్రత్యేక పంచాయతీల ఆవశ్యకతను వివరించారు. తద్వారా దళితవాడలు అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు.

ఆగిరిపల్లి : క్రిస్మస్ వేడుకలను మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లో ఉన్న పలు చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలను రంగురంగుల విద్యుత్ కాంతులతో అలంకరించారు. మండల పరిధిలోని కనసానపల్లి సిఎస్ఐ చర్చిలో పాస్టర్ కె.ఐజాక్ జాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

దెందులూరు : టిడిపి పార్లమెంట్ నూతన కమిటీలో స్థానం పొందిన దెందులూరు నాయకులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అభినందనలు తెలిపారు. ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా టిడిపి ఏలూరు పార్లమెంటు నూతన కమిటీలో స్థానం పొందిన పలువురు దెందులూరు నియోజకవర్గ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, పార్లమెంట్ అధికార ప్రతినిధులు గుడిపూడి రేవతి, సంపంగి వేణుగోపాల్ తిలక్, పార్లమెంట్ కార్యదర్శి దేవరపల్లి ఆదాం, ఏలూరు రూరల్ మండలాధ్యక్షులు నంబూరు నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నేతల రవి, కూటమి నాయకులు, పలువురు ఫాదర్లు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ కుటుంబాన్ని శ్రీనివాసపురం పిఎసిఎస్ డైరెక్టర్ తాళ్లూరి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకుని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్‌కుమార్ కుటుంబానికి అరుదైన బహుమతిని అందించారు. పండుగల సందర్భంలో పరస్పర సౌహార్దం, స్నేహబంధాలు మరింత



ఆగిరిపల్లిలో...


బలపడతాయని తెలిపారు.

పోలవరం : పోలవరంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ పాల్ లూథరన్



పోలవరంలో...

చర్చి పాస్టర్ ఐ.నోవాహు మాట్లాడుతూ క్రిస్మస్ ప్రేమ, శాంతి, సమానత్వం అనే విలువలను నేర్పే అపూర్వమైన పండుగని తెలిపారు. ఈ వేడుకల్లో సంఘ సిఆర్ ఇమ్మానుయేలు, చర్చి ఆల్టర్నేట్ డెలిగేట్



దెందులూరులో...

జి.అబ్రహం, సంఘ పెద్దలు, తొర్లపాటి రాజశేఖర్, సిహెచ్.రాజేష్, చిన్న బాబు, చిట్టిబాబు, డేవిడ్, స్త్రీల సమాజం, సంఘ సభ్యులు, సండే స్కూల్ పిల్లలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 20/2022 in O.S. No. 81/2010

Between:-

రంగిశెట్టి లక్ష్మణరావు ...DHR

మరియు

1. గుడాల రంగరావు
2. గుడాల కృష్ణారావు ...JDRs

వేలం ప్రకటన

వేలం తేది 12-01-2026

పై నెంబరు డిక్రీ బాకీకు JDRs తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి శ్రీ కోర్టువారి ఎదుట ది. **12-01-2026** న ఉదయం **10.30** ని॥లకు లగాయితు వేలం జరుపబడును. కావలసినవారు వేలంలో పాల్గొన వచ్చును. వేలం షరతులను DHR తరపు అడ్వకేట్ గారి వద్దగాని, కోర్టువారి వద్ద నజారత్ వద్దగాని తెలుసుకొనవచ్చు.

షెడ్యూలు

పశ్చిమగోదావరిజిల్లా, నరసాపురం మండలం, మొగల్తూరు సబ్‌రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, సీతారామ పురంసౌత్ గ్రామంలో చేరిన ఆర్.ఎస్.నెం.308/1 నందు గల య0-40ట్లు గల జిరాయితీ మెరక భూమికు హద్దులు:

తూర్పు: గుడాల నూకరాజుగారి భూమి
దక్షిణం: గుడాల వీరరాఘవులుగారి భూమి
పడమర: చిక్కాల చంద్రరాజు గారి భూమి
ఉత్తరం: నక్కా కుటుంబరావు గారి భూమి

ఈ హద్దుల మధ్య య0-40ట్లు మెరకభూమి అందలి యీజుమెంటు హక్కులతో సహా.

DHR Value: 5.00,000/-
Amina Value:600,000/-
NB, EC దాఖాల లావాదేవీలు ఏమియు లేవు.

పోలిశెట్టి సూర్యచంద్రరావు
DHR అడ్వకేట్, నరసాపురం

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమంహేంద్రవరం

IA.No.18/2024 in I.P.No.26/2022

Between:-

Manthenahari Krishna Varma ...Petitioner

and

Gottumukkala Narendra Varma and Others ...Respondents

1. Gottumukkala Narendra Varma (R2), S/o. Rama Krishnam Raju, Hindu, Aged 50 years, resident of Flat No.103, Punnami Towers, ASR Nagar, Bhimavaram,
2. Gottumukkala Aruna Varma (R3), S/o. Rama Krishnam Raju, Hindu, Aged 31 years, resident of Flat No.103, Punnami Towers, ASR Nagar, Bhimavaram.
3. Thota Trinadh (R9), S/o. Venkata Gopala Krishna, Hindu, Aged 56 years, resident of D.No.19-22-5/2, Bank Colony, Kalyana Mandapam Road, Bhimavaram,
4. Rudraraju Naga Venkata Ramajaneya Raju (R11), S/o. Venkata Subba Raju, Hindu, Aged 47 years, resident of D.No.27-13-7/1, Sapota Lodge Street, Bhimavaram.
8. BhimavarapuSuresh Kumar (R28),S/o.Veera Swamy, Hindu, Aged 49 years,resident of D.No.15-7-11, Muslims Street, Bhimavaram.

పై నంబరు పిటిషన్‌లో 1,2,3,4,8 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.07-01-2026** సం॥రం తేదీ ఉదయం **10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషను మీకు పరోక్షముగా॥శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

కె.భరణీకుమార్
అడ్వకేట్
రాజమండ్రి రాజమండ్రి
ది.25-12-2025 సెల్.9848315163

CHANGE OF NAME

I, **SHAIK AMEER BABU**, S/o. **Abdhul khadhar**, Resident of 2-85, Maseedu Veedhi, Komarru Village, Ganapavaram Mandal, W.G.District. A.P. have changed my Name from **SHAIK AMEER** (OLD NAME) to **SHAIK AMEER BABU** (NEW NAME) Hence forth I am being called as **SHAIK AMEER BABU** (NEW NAME) for all purposes.

పాస్‌పోర్టు పోయినది

షేక్ అమీర్‌బాబు S/o.షేక్‌అబ్దుల్ ఖాధర్ డోర్‌నెం. 2-85, మసీదు వీధి, కోమర్రు, గణపవరం మండలం, ప॥గో॥జిల్లా. ఆంధ్రప్రదేశ్ .నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు **B1279034** ను ఒక సంచిలో పెట్టుకుని ది.10.07.2025 సం॥రం తేదిన జిరాక్స్ తీయించు కొనుటకు కోమర్రులో మా ఇంటి నుండి మొయ్యేరు సైకిల్ పై వెళ్ళుచుండగా సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ గల సంచి జారిపడి పోయినది. ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందచేయగలరు.

షేక్ అమీర్‌బాబు S/o.షేక్‌అబ్దుల్ ఖాధర్

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No.1226/2024 and O.S.No.156/2024

వాది :

1.శ్రీ పారేపల్లి చిన్నబాబు, S/o.వెంకటేశ్వరరావు, హిందు, పురుషుడు, వయస్సు 40 సం॥లు, అచ్చుతాపురం గ్రామం, కొయ్యలగూడెం మండలం, ఏలూరు జిల్లా. సెల్: 8978896379.

ప్రతివాదులు : 1. శ్రీ కారంకి వెంకటరత్నం, S/o.వీరస్వామి, హిందు, పురుషుడు, వయస్సు 67 సం॥లు, అశోక్‌నగర్, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.
2. శ్రీ కారంకి కనకదుర్గ, W/o.వెంకటరత్నం, హిందు, స్త్రీ, వయస్సు 56 సం॥లు, అశోక్‌నగర్, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.
3.శ్రీ కారంకి రామప్రసాద్, S/o.వెంకటరత్నం, హిందు, పురుషుడు, వయస్సు 40 సం॥లు, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.
4.శ్రీ కారంకి లక్ష్మణకుమార్, S/o.వెంకటరత్నం, హిందు, పురుషుడు, వయస్సు 38 సం॥లు, అశోక్‌నగర్, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.
5.శ్రీ కారంకి జానకిశ్రీ సత్యనారాయణ, S/o.వెంకటరత్నం, హిందు, పురుషుడు, వయస్సు 30 సం॥లు, అశోక్‌నగర్, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.
6.శ్రీ కారంకి విజయకుమార్, S/o.వెంకటరత్నం, హిందు, పురుషుడు, వయస్సు 27 సం॥లు, అశోక్‌నగర్, కొయ్యలగూడెం గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.

పై నంబర్ దావాలో ప్రతివాది 3,4,5 అను వార్లకు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను మరియు శ్రీయుత కోర్టు వారి ద్వారాను అనేక మార్లు సమన్లు మీకు పంపియున్నప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకముగా సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పై నంబర్ దావా గ్రంథము వాయిదా తేది.8-1-2026 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట వ్యక్తి గతంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. లేనియడల మీ పరోక్షమున తీర్పు నిర్ణయించబడును అని ఇందు మూలముగా తెలియజేయడం అయినది.

కొండాబత్తుల నరసింహారావు
జంగారెడ్డిగూడెం అడ్వకేట్
తేది.24.12.2025 సెల్: 9848121155